ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 6 ఏప్రిల్ 2024


రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శనివారం
సాయంత్రం - 6:36
సహర్ - ఆదివారం
ఉదయం - 4:43



భక్తిశ్రద్ధలతో 'జుమాతుల్ విదా'

ఆమనగల్లు, ఏప్రిల్ 5: రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా జుమాతుల్ విదా పర్వదినాన్ని ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆమనగల్లు జామా మసీద్, షైమదే హిలాల్, మహ్మదీయ మసీద్‌లలో జరిగిన వేడుకల్లో కమిటీ అధ్యక్షులు మహ్మద్ మాసూమ్, మహ్మద్ గౌస్, ఖాదర్‌ఖాద్రీ, ముస్లింలు పాల్గొన్నారు. హిమామ్ అతీఫ్ ముస్లింలను ఉద్దేశించి మాట్లాడారు. నాయకులు సయ్యద్ ఖలీల్, జబ్బార్, ఎంఏ ఖలీల్, రజాక్, మహబూబ్, అల్తాప్, నయీమ్, మజీద్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలోని మసీద్ కుభా, మసీద్ హర్షద్‌లలో ఇమామ్‌లు జహీరోద్దీన్, మహ్మద్ తాజీబ్ ఆధ్వర్యంలో జుమాతుల్ విదా కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రాహంఫ్, అహ్మద్ జానీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ జావేద్, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు లాయక్‌అలీ, జహంగీర్‌అలీ, ఈర్షద్, తదితతరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీలత

'ఉపాధి' పనులను వినియోగించుకోవాలి

డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత

కేశంపేట, ఏప్రిల్ 5: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలు పనులను వినియోగించుకోవాలని డీఆర్డీఏ పీడీ ఎల్.శ్రీలత సూచించారు. మండల పరిధిలోని బొదునంపల్లి, లేమామిడి, కొండారెడ్డిపల్లి, అల్వాల గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బొదునంపల్లి గ్రామంలో కూలీలతో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి కూలీ రూ. 300లకు పెంచినట్లు తెలిపారు. వేసవి నేపథ్యంలో ఉదయం 6 నుంచి 11గంటల వరకు, సాయంత్రం వాతవరణం చల్లబడిన తరువాత కూలి పనులు చేసుకోవాలని సూచించారు. కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించారు. అనంతరం లేమామిడి, కొండారెడ్డిపల్లి, అల్వాలలో నర్సరీలను పరిశీలించారు. ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలను పెంచాలని నిర్వాహకులు, సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీఏ ఏపీడీ శ్రీచరణ్ గౌతమ్, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఏపీవో అజీజ్, టీఏ నీలకంఠ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వెంకటేష్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చౌదరిగూడ, ఏప్రిల్ 5 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు రోజుకు వేతనం రూ.600 చెల్లించి, వంద రోజులు పని కల్పించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం కూలీలకు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కూలీలకు ఐదు వారాల నుంచి డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు సరిగా పడకపోవడంతో కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ప్రతీ ఒక్కరు ఉపాధి పనులకు వస్తున్నారని చెప్పారు. ఎండలో పనిచేస్తున్న కూలీలకు కనీసం మంచినీరు అందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్, రంగయ్య, మల్లయ్య, సత్యయ్య, బాల్‌రాజ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణం

తుక్కుగూడ కాంగ్రెస్ పార్టీ జెండాలతో నిండిపోయింది. ఎక్కడ చూసినా రాహుల్, రేవంత్‌రెడ్డి, ఖర్గే భారీ కటౌట్లే కనిపిస్తున్నాయి. సభా వేదిక పూర్తిస్థాయిలో నిర్మాణం అయింది. కాంగ్రెస్ పార్టీ నేడు తుక్కుగూడలో నిర్వహించనున్న జనజాతర సభకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు సభకు వచ్చే వారికి మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు. అంతే కాకుండా ప్రతి పోలింగ్ బూత్ నుంచి పది నుంచి 20మందికి తగ్గకుండా జనాలను తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. మొత్తానికి ఈ సభకు పది లక్షల మంది హాజరు అవుతారని అంచనా వేసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆ మేర ఏర్పాట్లను కూడా పూర్తి చేశారు.

సర్వం సిద్ధం!

నేడే తుక్కుగూడలో కాంగ్రెస్ జనజాతర

- హాజరుకానున్న అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ
- భారీగా తరలి రానున్న జనాలు
- వేయిమంది పోలీసులతో భారీ బందోబస్తు
- తాగునీరు, మజ్జిగ, వైద్య సదుపాయాలు

రంగారెడ్డి అర్బన్/మహేశ్వరం/కందుకూరు, ఏప్రిల్ 6 : లోక్‌సభ ఎన్నికల ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా పార్లమెంట్ ఎన్నికలకు సమరశంఖం పూరించనుంది. నేడు (శనివారం) తుక్కుగూడలో జరగనున్న రాజీవ్‌గాంధీ జనజాతర సభకు ఇప్పటికే ఆ పార్టీ నాయకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ హాజరు కానున్నారు. ఈ సభలోనే లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను కూడా ప్రకటించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుకు చేరువలో 70 ఎకరాల్లో బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సభా వేదికకు సమీపంలోనే 550 ఎకరాలు పార్కింగ్ కోసం వేర్వేరు స్థలాలు ఏర్పాటు చేశారు. ఈ సభకు 10లక్షలకు తగ్గకుండా జనాలను తరలించాలని ఆ పార్టీ నాయకు లక్ష్యంగా పెట్టుకున్నారు. బూత్ స్థాయి నుంచి 10-20 మందికి పైచిలుకు తీసుకు వచ్చేందుకు పార్టీ నేతలు కృషి చేస్తున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు 2023 సెప్టెంబరు 17న తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, సోనియాగాంధీ ఆరు గ్యారంటీలను ప్రకటించారు. ప్రజల్లో వాటికి మంచి ఆదరణ లభించింది. తుక్కుగూడ ప్రాంతం కాంగ్రెస్‌కు సెంటిమెంట్‌గా మారడంతో మరోసారి ఇక్కడి నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు రంగం సిద్ధం చేసింది. కనీవిని ఎరగనీ తీరులో జనజాతరను నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమయ్యారు. ఎండల వల్ల ఇబ్బందులకు కలగకుండా సభకు తరలి వచ్చే జనాలకు తాగునీరు, మజ్జిక ప్యాకెట్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేశారు. 24 లక్షల వాటర్ బాటిళ్లు, 12 లక్షల మజ్జిగ ప్యాకెట్లు రెడీ చేశారు. 300 మంది వలంటీర్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు చల్లగా ఉండేందుకు ఐస్ డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్నారు. ఒక డ్రమ్ము వద్ద ఒక ఇన్‌చార్జిని నియమించారు. రాజీవ్‌గాంధీ పేరుతో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలు, కటౌట్లతో నిండిపోయింది. పోటాపోటీగా నేతలు భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. అయితే, ఎవరికీ ఇబ్బంది కలగవద్దని తుక్కుగూడ మున్సిపాలిటీ నుంచి సభా ప్రాంగణం వరకు రెండు కిలోమీటర్ల మేర పోలీసులు ఆంక్షలు విధించారు.

భారీ బందోబస్తు..

కాంగ్రెస్ సభకు భారీ సంఖ్యలో జనాలు తరలి వస్తుండటంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ముగ్గురు డీసీపీలు, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, 12మంది ఏసీపీలు, 31మంది సీఐలు, 56 మంది ఎస్సైలు, 54మంది ఏఎస్సైలు, 226 మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొననున్నారు. అదేవిధంగా మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా 93 మంది మహిళా కానిస్టేబుళ్లు, ఏఆర్, స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్ సిబ్బంది కూడా బందోబస్తులో పాల్గొంటున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

కాంగ్రెస్ జనజాతర సభ ఏర్పాట్లను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, విష్ణునాథం, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ఉన్నారు. అలాగే పార్టీ సీనియర్ నేతలు మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, పీసీసీ కార్యదర్శులు జానకిరాం, ఏనుగు జంగారెడ్డి, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కూడా వారి వెంట ఉన్నారు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు


ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించే జనజాతర సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలో మహిళలకు ఉచిత రవాణా, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతీ పథకాన్ని అర్హులకు చేరవేస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ వల్ల కొన్నింటిని అమలు చేయలేకపోతున్నామని, ఎన్నికల తర్వాత అమలు చేయనున్నట్లు తెలిపారు. నేడు జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, ఏనుగు శ్రావణి, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'ఆదిభట్ల' చైర్మన్ ఎన్నిక ఏకపక్షమేనా?

- వైస్‌చైర్మన్ పదవికి తీవ్ర పోటీ
- నేడు మున్సిపల్ ప్రత్యేక సమావేశం





మర్రి నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, ఏప్రిల్ 5 : ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పర్వం తుది దశకు చేరింది. నేడు (శనివారం) ప్రత్యేక సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 9న మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక, వైస్ చైర్ పర్సన్ కోరే కళమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ సభ్యులు ఏకపక్షంగా ఓటేయడంతో అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. చైర్మన్ ఆశావహుడు మర్రి నిరంజన్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉంటూనే అధికార పార్టీకి చైర్‌పర్సన్ కొత్త ఆర్థికపై అవిశ్వాసం పెట్టడంతో ఆగ్రహించిన పార్టీ అధిష్ఠానం ఆయనకు షోకాజ్ నోటీస్ ఇచ్చింది. ఆ నోటీసుకు తగిన వివరణ ఇవ్వని కారణంగా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే కారణంతో అధిష్ఠానం ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కాగా, ఆదిభట్ల చైర్మన్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని నిరంజన్‌రెడ్డి తనదైన శైలిలో క్యాంపు రాజకీయాలు నడుపుతూ, ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీలో మొత్తం 15 మంది సభ్యులకుగాను అవిశ్వాసం ఎదుర్కొన్న మాజీ చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక, మాజీ వైస్ చైర్‌పర్సన్ కళమ్మ మినహాయిస్తే 13 మంది సభ్యులు మర్రి నిరంజన్‌రెడ్డి పక్షాన ఉండటంతో నేడు జరగబోయే చైర్మన్ ఎన్నిక లాంఛనమే అని చర్చ జరుగుతోంది.

వైస్ చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో!

కాగా, ఆదిభట్ల మున్సిపాలిటీలో మొత్తం 15 మంది వార్డు కౌన్సిలర్లకుగాను కాంగ్రెస్‌కు చెందినవారు 8మంది, బీఆర్‌ఎస్ సభ్యులు ఆరుగురు, బీజేపీ నుంచి ఒకరున్నారు. వీరిలో ఇద్దరు సభ్యులు మినహా మిగతా 13 మంది సభ్యులు కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత మర్రి నిరంజన్‌రెడ్డి పక్షాన ఉండటంతో చైర్మన్ ఎన్నిక ఏకపక్షమనే చర్చ జరుగుతోంది. అవిశ్వాసం తరువాత చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలకు రెండు నెలల సమయం ఉండటంతో వైస్ చైర్మన్ ఆశావాహుల సంఖ్య పెరిగిపోయింది. వైస్ చైర్మన్ ఎన్నికకు తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. గతంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న కోరే కళమ్మతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ కొంగరకలాన్‌కు చెందిన కౌన్సిలర్లు వనం శ్రీనివాస్.. మరో ఇద్దరు సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా బీజేపీ నుంచి గెలిచిన పొట్టి రాములు గతంలో చైర్మన్‌గా మర్రి నిరంజన్‌రెడ్డి ఎన్నికకు బేషరతుగా మద్దతు ప్రకటించారు. వైస్ చైర్మన్‌గా రాములుకు అవకాశం కల్పించేందుకు నిరంజన్‌రెడ్డి మాట ఇచ్చినట్లు తెలిసింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరవుతారనేది నేడు తేలిపోనుంది.

తాగునీరు వృథా..

- పైపులు వేసి ట్యాప్‌లు బిగించని వైనం
- పట్టించుకోని గ్రామపంచాయతీ యత్రాంగం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 5: రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరా సరిగాలేక నానా అవస్థలు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడి, బోర్లలో కూడా నీరు రావడం లేదు. దాంతో ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే పరిస్థితి నెలకొంది. అయితే, దీనికి భిన్నంగా మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామంలో తాగునీరు వృథా అవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. అధికారుల నిర్లక్ష్యంతో నీరు రోడ్డు పాలవుతోంది. గ్రామంలో తాగునీటి సరఫరాకు నల్లా పైపులు ఏర్పాటుచేసి ట్యాప్‌లు బిగించడం మర్చిపోయారు. దాంతో తాగునీరు వృథాగా పోతోంది. ఎక్కడ చూసినా రోడ్డుపైనే నల్లా నీరు కనిపిస్తోంది. పలు కాలనీల్లో ఇప్పటికే నీటి సరఫరా సక్రమంగా లేదని, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



నాగిరెడ్డిగూడలో వృథాగా పోతున్న నల్లా నీరు

టీడీపీ బలోపేతానికి చర్యలు

ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 5 : తెలుగుదేశం పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో టీడీపీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి, అశోకుడి ధర్మచక్రంలోని 24 ఆకుల సందేశాలను వివరించారు. ప్రజాసేవ చేయడానికి పదువులే ఉండాల్సిన అవసరం లేదని, నిజాయితీ, నిస్వార్థంతో పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారని ఆయన అన్నారు. అధికార వ్యామోహంతో చాలామంది పార్టీలు మారుతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమంగా అరెస్టు కావడం, టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పార్టీ మారడంతో పార్టీ ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేయలేకపోయిందని అన్నారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే తెలంగాణలో టీడీపీ బలోపేతంపై దృష్టిపెట్టడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని పెంచి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రోత్సహిస్తామని బక్కని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పార్టీని పటిష్ఠపరిచి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సన్నద్ధం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, ఆన్మారి వెంకటయ్య, వెంకటయ్యగౌడ్, రుక్నోద్దీన్, రాజశేఖర్‌రెడ్డి, యాదగిరిచారి తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

రాష్ట్రంలో కాంగ్రెస్ హవా


మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కృష్ణ ముదిరాజ్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ హవా కొనసాగుతోందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి కండ్లకోయకు చెందిన బీజేపీ నాయకుడు నత్తి కృష్ణ ముదిరాజ్ సుధీర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎంత ప్రయత్నించినా మాల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం మాత్రం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను తమ ప్రభుత్వం నెల బెట్టుకుంటుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారం చేపట్టిన వందరోజుల్లోపు నెరవేర్చామన్నారు. సమీప కాలంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఖాళీ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ యాదవ్‌య తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' వాటర్‌గ్రిడ్ పరిశీలన


ఘన్‌పూర్ మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 5: మండలంలోని ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్ నగరానికి నీరందించే ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఆయన మేడ్చల్ మండలంలోని ఘనాపూర్ వాటర్ గ్రిడ్‌ను సందర్శించారు. మేడిగడ్డ, కొండపోచమ్మ జలాశయాల పరిస్థితిని పరిశీలించటానికి వెళ్తున్న సందీప్‌కుమార్ మేడ్చల్ మండలంలోని ప్రధాన వాటర్‌గ్రిడ్ పని తీరును తెలుసుకోవటానికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వాటర్ గ్రిడ్‌లో నిలువ చేస్తున్న నీటిసామర్థ్యం, ఇతర సాంకేతిక వ్యవహారాల గురించి వాటర్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సందీప్ కుమార్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఎస్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ విజయ్ ప్రకాష్, ఎస్ఈ శ్రీనివాస్ చారి, ఈఈలు రాజయ్య, నర్సింగ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంకల్‌లో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకుడు

పూడూరు, ఏప్రిల్ 5: మండలంలోని కంకల్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువుకు యువకులు ముందుకకు వచ్చి రక్తదానం చేశారు.

వీరశైవ లింగాయత్-లింగ బలిజ సంఘం

తాండూరు పట్టణ నూతన కార్యవర్గం


కార్యవర్గం ఎన్నిక నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్

తాండూరురూరల్, ఏప్రిల్ 5: వీరశైవ లింగాయత్-లింగ బలిజ సంఘం తాండూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్, గౌరవాధ్యక్షుడు మొలిగి వీరేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా యద్రామి బసనప్ప, అధ్యక్షుడిగా గాజుల వీరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఆర్.శరణబసప్ప, తుప్పుడు శేఖర్, చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పటేల్ విజయకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లికార్జున్, సహకార్యదర్శులుగా అల్లం మల్లికార్జున్, గాజుల కమలాకర్, కాసాల నరేందర్, కోశాధికారిగా విజయ్‌భాస్కర్, న్యాయ సలహాదారులుగా శరత్‌చంద్ర, కార్యవర్గ సభ్యులుగా గాజుల బస్వరాజ్, సిద్రామయ్య, రాచప్ప, పటేల్ రాజేంద్రప్ప, బస్వరాజ్, వీరన్న తదితరులను ఎన్నుకున్నారు. ఓబీసీల కోసం పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

చిన్నశేషవాహనంపై వేంకటేశ్వరుడి దర్శనం

కొడంగల్, ఏప్రిల్ 5: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు చిన్నశేష వాహనంపై దర్శనమిచ్చారు. బద్రి నారాయణుడి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భక్తులు కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలి రావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది.

వైభవంగా రథోత్సవం



పాంబండపై రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు

కులకచర్ల, ఏప్రిల్ 5: కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ శివ నామస్మరణతో మారుమోగింది. పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి జాతరలో భాగంగా గురువారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున రథోత్సవం నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ యథాస్థానం నుంచి శ్రీరాముల పాదాల వరకూ భక్తులు రథాన్ని లాగారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి కల్యాణోత్సవం, రథోత్సవంలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్ పర్యవేక్షించారు.

మాట నిలబెట్టుకునే నేత మోదీ

» మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం, ఏప్రిల్ 5: ప్రజలకు మాట ఇస్తే ఆ మాటను నిలబెట్టుకునే ఏకైక నేత నరేంద్ర మోడీ అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని బొపునారం, తొర్మామిడి, రొంపల్లి, సల్బత్రాపూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామమందిరాన్ని కట్టిన ఘనత మోదీకే దక్కిందన్నారు. దేశమంతా మరోసారి మోదీ పాలన కోసం ఎదురు చూస్తోందన్నారు. పేదలను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. ఆ రెండు పార్టీలకు స్కాంలు చేయడం తప్ప ప్రజలకు స్కీములు అమలు చేయడం తెలియదని ఎద్దేవా చేశారు. మే 13న జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అత్యధిక మెజార్టీ రావాలని పిలుపునిచ్చారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో వికారాబాద్ జిల్లా అధ్యక్షురాలు మాధవి రెడ్డి, తాండూరు నియోజకవర్గం కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్‌యాదవ్, సీనియర్ నాయకులు విజయరాజు, బూత్ ఇన్‌చార్జిలు సురేష్, భాను, నరసింహులు, కొండా వీరారెడ్డి పాల్గొన్నారు.



కామునిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఇంటింటి ప్రచారంలో విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు

కులకచర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని పీరంపల్లి, కామునిపల్లి, బొంరెడ్డిపల్లి, రాంనగర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చేవెళ్ల బరిలో ఎంపీగా పోటీ చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు డాక్టర్ మీరారెడ్డి, సాధన, విజయవాణి, రమ, సునీత, గౌతమి, కల్పన, అనురాధ, జితేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు అంజిలయ్య, గుడాల వెంకటయ్య, మల్లేశ్, కృష్ణారెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాదయాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

» భువనగరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 5 : ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొలువు దీరి నాలుగు నెలలు కావస్తున్నా రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతుబంధు డబ్బులు పూర్తి స్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క. నర్సింహారెడ్డి, కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ మాట్లాడుతూ ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క. రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగా రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఎన్ను యాదగిరెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు అజంయ్య యాదవ్, నల్లబోలు భోజిరెడ్డి, బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, పోరెడ్డి నర్సింహారెడ్డి, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, పాల్గొన్నారు.



కిసాన్ మోర్చా రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న డా.బూర నర్సయ్యగౌడ్

ఎస్సీ నిరుద్యోగులకు ఉచితంగా గ్రూప్ కోచింగ్

వికారాబాద్, ఏప్రిల్ 5: గ్రూప్స్ ఉద్యోగాలకు స్పెషల్ ఫౌండేషన్ కోర్సును జిల్లా ఎస్సీ, నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎన్. మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న వివిధ ఉద్యోగాల నియామక ప్రక్రియల్లో భాగంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన 100మంది ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. కోచింగ్ ను నిష్ణాతులైన అధ్యాపకులతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కోచింగ్ సమయంలో వారికి హాస్టల్ వసతి, భోజన సదుపాయంతో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7013200133 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.



మల్కాపూర్ గ్రామంలో హోమంలో కూర్చున్న దంపతులు

ఘనంగా ద్వితీయ పుష్కర కుంభాభిషేకం

చేవెళ్ల, ఏప్రిల్ 5 : చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయ స్వామి వార్ల దేవాలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. దేవాలయంలో దంపతులు పెద్ద సంఖ్యలో హోమంలో కూర్చుని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేకపూజలు చేశారు. దీంతో దేవాలయం శివనామస్మరణతో మారుమోగింది. ఈ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం నేటి వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

» ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

చేవెళ్ల, ఏప్రిల్ 5 : మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డి పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్యఅతిగా ఎమ్మెల్సీ వెంకట్ పాల్గొని మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యన్ రాజేశ్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌గుప్తా, భీమయ్య, మైనార్టీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



చేవెళ్లలో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

వడదెబ్బకు వృద్ధురాలి మృతి

కులకచర్ల, ఏప్రిల్ 5: వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. వికారాబాద్ జిల్లా, పరిగి నియోజవర్గంలోని చౌడాపూర్ మండలం, వీరాపూర్ గ్రామానికి చెందిన రెబ్బనమోని వెంకటమ్మ (70) బుధవారం చౌడాపూర్ సంతకు వెళ్లింది. అక్కడ ఎండ వేడిమిని తట్టుకోలేక స్పృహతప్పి కిందపడింది. దీంతో గమనించిన స్థానికులు పాలమూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె వడదెబ్బకు గురైందని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యశీలారెడ్డి తెలిపారు.



ఆర్షియబానుకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న పురుషోత్తంరెడ్డి

విద్యావంతులను తయారు చేయడమే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : సమాజానికి మంచి విద్యావంతులను తయారు చేయడమే తమ లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఆ యూనివర్సిటీకి చెందిన ఆర్షియబాను అనే విద్యార్థిని రసాయనశాస్త్రంలో 'డిజైన్ సింథసిస్ అండ్ యాంటీ - క్యాన్సర్ ఎవాల్యూయేషన్ ఆఫ్ సమ్ నావల్ హెటిరో సైక్లిక్ కాంపౌండ్స్' అనే అంశంపై డాక్టర్ జే. భాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసింది. శుక్రవారం పురుషోత్తంరెడ్డి ఆమెను అభినందించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు చేసే విద్యార్థులకు తమ యూనివర్సిటీ చక్కటి వేదికని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు గుర్రపు దామోదర్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, కవిత, రీసర్చ్ డీన్ ఆచార్య క్రిష్టోఫర్, డీన్ సైన్స్ సుందర్‌రాం, వివిధ డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలు, పీఆర్‌ఓ గాదె రాంబాబు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సంకేపల్లిగూడ, శేరిగూడ గ్రామస్థులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

షాబాద్, ఏప్రిల్ 5 : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఆధ్వర్యంలో సంకేపల్లిగూడ, శేరిగూడ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, అంజయ్య, అంజిరెడ్డి, వెంకటయ్య, సత్యనారాయణ, సత్యం, నర్సింహులు, వెంకటయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు కృషి

- మండలాల్లో ఘనంగా జయంతి వేడుకలు
- విగ్రహాలు, చిత్రపటాలకు ఘన నివాళులు


షాద్‌నగర్‌లో బాబు జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న వీర్లపల్లి

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 5 : భారతదేశ మాజీ ఉపప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్‌రాం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. ఆయన జయంతిని పురష్కరించుకుని శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఎదుట గల జగ్జీవన్‌రాం విగ్రహానికి ప్రజాప్రతినిధులు, పార్టీలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రజా సేవను గుర్తుచేశారు. కోర్టు సముదాయంలో బాబు జగ్గీవన్‌రామ్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బక్కని నర్సింహులు, బీజేపీ నాయకులు అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, దేపల్లి అశోక్, అమడపూరం నర్సింహ్మగౌడ్, బార్ అసోసియేషన్ నాయకులు రాజశేఖర్‌రాజు, శ్రీధర్‌గౌడ్, ప్రజా సంఘాల నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, అర్జునప్ప, పాల్గొన్నారు.

యాచారం : బాబుజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా యాచారం, గున్‌గల్, చిన్నతూండ్ల, నందివనపర్తి, మాల్, చింతపట్ల. మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాల నాయకులు ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గజ్జిరామకృష్ణయాదవ్, నాయకులు కె.యాదయ్య, కృష్ణ ఉన్నారు.

కేశంపేట : మండల పరిషత్ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, ఏపీడీ శ్రీచరణ్, ఏపీవో అజీజ్ పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో డాక్టర్ బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పాల్గొని పూలమాలలు వేశారు. అంబేద్కర్, శాంతి యువజన సంఘాల అధ్యక్షులు కంజర్ల శేఖర్, నరేష్ ముదిరాజ్, అంబేద్కర్ సంఘం నాయకులు షాబాద్ శాంతి, సందీప్, పాల్గొన్నారు.

హిమాయత్ నగర్ చౌరస్తా వద్ద ఉన్న బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి బీఆర్‌ఎస్ మండల నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మొయినాబాద్ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోర శ్రీను పాల్గొని మాట్లాడారు. నాయకులు జయవంత్, రాఘవేందర్, మహేందర్, రాజు, ఉన్నారు.

ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్ : బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండల కేంద్రాల్లో నాయకులు ఘనంగా నిర్వహించి, ఆయన చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకుడు రమేశ్, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు పోతుగంటి కృష్ణ మాదిగ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్, సుధాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్య నాయక్, మోహన్‌రెడ్డి, డేవిడ్, పాల్గొన్నారు.

షాబాద్ : షాబాద్ మండలంలోని నాగర్‌గూడ, షాబాద్, పోత్‌గల్, తదితర గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రవీందర్, వెంకట్‌యాదవ్, రాజేందర్‌గౌడ్, వెంకటయ్య, రాహుల్‌గుప్తా, చంద్రయ్య, పాల్గొన్నారు.

కందుకూరు : బాబు జగ్జీవన్‌రాం జయంతిని మండల పరిధిలోని నేదునూరు, దాసర్లపల్లి, దెబ్బడగూడ, కందుకూరు, రాచులూరు, లేమరులో ఘనంగా జరిపారు. పట్టణ కేంద్రంలోని ఆయన విగ్రహానికి పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి పార్టీ నేతలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ ఎండి అప్జల్‌బేగ్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బుక్క ప్రశాంతిపాండురంగా రెడ్డి, జగదీష్, డిల్లీ శ్రీధర్, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు ఇబ్రహీంపట్నంలో ఘనంగా జరిగాయి. ఎంపీపీ కృపేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు వర్కాల పరమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజు, బీరప్ప, జగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్తూర్ : బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద అంబేడ్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిమ్మాపురం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుప్పర రమేష్, రంజిత్, శివకుమార్, పాల్గొన్నారు.

చేవెళ్ల : బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బండారు శైలజ ఆగిరెడ్డి, చేవెళ్ల ఎంపీటీసీ గుండాల రాములు, బిజెపి చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, ఎం. వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ప్రభులింగం, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డిలు నివాళులర్పించారు.

శంషాబాద్ రూరల్ : బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు రత్నంమాదిగ, రమేష్‌మాదిగ, కె. రమేష్‌మాదిగ, చిట్టిబాబు, యాదయ్యమాదిగ, రాజేందర్, ప్రభాకర్, యాదగిరి, చిన్న రమేష్, పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఆమనగల్లులో వేడుకల్లో మున్సిపల్ సిబ్బంది


షాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


కందుకూరు: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


యాచారం : బాబుజగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు


కేశంపేట : నివాళులర్పిస్తున్న అధికారులు


కొత్తూర్‌లో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


శంషాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


ఇబ్రహీంపట్నం నివాళులర్పిస్తున్న పీఆర్టీయూ నేతలు

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహేశ్వరం/శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : మోడల్ స్కూళ్లలో 2024 - 25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 వ తరగతిలోని 100 సీట్లకు, 7, 8, 9, 10 తరగతుల్లో గల ఖాళీ సీట్ల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రేపు (ఆదివారం) జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని మహేశ్వరం మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్, పాల్మాకుల మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ విష్ణుప్రియ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఉదయం 10 గంటలనుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10 వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు తమ స్కూల్‌లో పరీక్ష ఉంటుందని, గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని మహేశ్వరం మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ తెలిపారు. పాల్మాకుల మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ శంషాబాద్ బాలిక పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పరీక్షలు నిర్వహిస్తామనిపాల్మాకుల మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ విష్ణుప్రియ చెప్పారు. గంటన్నర ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

భీంభరత్ నోరు అదుపులో పెట్టుకోవాలి

- బీజేపీ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేదంటే మళ్లీ జైలులో ఊచలు లెక్కపెట్టుకునే రోజులు వస్తాయని మొయినాబాద్, నవపేట్, షాబాద్ మండలాల బీజేపీ అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శంకర్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేశ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం వారు చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ మచ్చలేని నాయకుడు చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అని చెప్పారు. ఆయన ఆయన గురించి రంగారెడ్డి జిల్లా ప్రజలకు తెలుసని చెప్పారు. రత్నంకు రాజకీయంగా ఏ పార్టీ న్యాయం చేయలేదని విమర్శించారు. చేవెళ్ల ఎంపీ. అభ్యర్థి రంజిత్‌రెడ్డి 400 కోట్ల ప్యాకేజీ ఇచ్చి కాంగ్రెస్ టికెట్ కొన్నారని ఆరోపించారు. భూకబ్జాలు చేసిన చరిత్ర భీంభరత్‌ది అని, రంజిత్‌రెడ్డి కోసం వకాలత్ పుచ్చుకోవొద్దని హితవు పలికారు. నిజాయితీ గురించి ఆయన మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. సమావేశంలో నాయకులు రాజ్‌గౌడ్, బీజేవైఎం జనరల్ సెక్రటరి గణేశ్ తదితరులు ఉన్నారు.

జనజాతర సభకు తరలి రావాలి


మాట్లాడుతున్న బీచ్యనాయక్

కడ్తాల్/మాడ్గుల/మహేశ్వరం, ఏప్రిల్ 5: తుక్కుగూడలో జరుగబోయే కాంగ్రెస్ జనజాతర సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు ఉప్పెనలా తరలిరావాలని కాంగ్రెస్ కడ్తాల మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ పిలుపు నిచ్చారు. సభ విజయవంతం ద్వారా తెలంగాణలో మరో మారు కాంగ్రెస్ సత్తా చాటాలని ఆయన కోరారు. కడ్తాల మండలం కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జునఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి లు పాల్గొనే సభ విజయవంతాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, లక్ష్మయ్య, రాంచందర్ నాయక్, అశోక్, సత్యం యాదవ్, శ్రీను, రాజేశ్, రమేశ్‌గౌడ్, పాల్గొన్నారు.


భాస్కర్‌రెడ్డి

తుక్కుగూడలో శనివారం జరుగబోయే జన జాతర మహా సభను విజయ వంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

తుక్కుగూడలో నేడు కాంగ్రెస్ నిర్వహిస్తున్న జన జాతర భారీ బహిరంగసభకు నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు దేపభాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం తుక్కుగూడలో జనజాతర సభ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సభ విజయవంతానికి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులతో పాటు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి జనజాతరను విజయవంతం చేయాలని ఆయన అన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన


నాభిశిలను తీసుకొస్తున్న గ్రామస్థులు

కందుకూరు, ఏప్రిల్ 5 : మండలంలోని అగర్మియాగూడ గ్రామంలో శుక్రవారం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి, మల్లికార్జున స్వామి దేవాలయాల నిర్మాణానికి శంకుస్థాపన ఘనంగా జరిగింది. వేద పండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6గంటలకే పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం 7:45 గంటలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇ.భూపాల్‌రెడ్డి, నాయకులు ఇ.శ్రీకాంత్‌రెడ్డి, వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి, జంగారెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి : మండల పరిధిలోని మర్రిగుంత తండాలో నూతనంగా నిర్మిస్తున్న దేశిరామ్ ఆలయ నిర్మా ణానికి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. గిరిజనుల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి ఉప్పల ట్రస్ట్ ద్వారా అవసరమైన మెటీరీయల్‌ను సమకూర్చారు. శుక్రవారం ట్రస్ట్ సభ్యులు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజ్జేశ్ నాయక్ , మంత్ర్య, బావోజీ , శ్రీను, పాండు, చందు, వెంకటేశ్, రాంచందర్, తారాసింగ్, తావుర్య, పూల్య, నాను, పంతు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. .

మాదిగలకు ఒక్క సీటూ కేటాయించని కాంగ్రెస్


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 5 : రాష్ట్ర జనాభాలో 12శాతం ఉన్న మాదిగలకు కాంగ్రెస్ ఒక్క సీటును కూడా కేటాయించకపోవడంతో ఆ పార్టీ మాదిగలకు ద్రోహి మారిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహమాదిగ అన్నారు. పార్లమెంట్‌లో మాదిగల గళం లేకుండా చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ్మమాదిగ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ చౌరస్థాలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీలకు రిజర్వు చేసిన మూడు స్థానాల్లో రెండు స్థానాలను మాలలు, ఒక స్థానం బైండ్ల కులస్థులకు కేటాయించడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని తెలిపారు. చౌరస్థాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులును పోలీసులు అరెస్టు చేసి, ఆతరువాత సొంతపూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జి. ప్రశాంత్‌మాదిగ, ఆనంద్‌మాదిగ, వినోద్‌మాదిగ, అశోక్ మాదిగ, శ్రీనివాస్‌మాదిగ, పాండు మాదిగ, మహేందర్ మాదిగ, జంగయ్యమాదిగ తదితరులు పాల్గొన్నారు.

మతం కన్నా మానవత్వం మిన్న


పండ్లు పంపిణీ చేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు , ఏప్రిల్ 5 : కులం, మతం కన్నా మానవత్వం మిన్న అనేదే మతాల సారాంశం అదేనని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాల పండుగలకు ప్రాధాన్యం ఇస్తుందని ఆయన చెప్పారు. పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మజీద్‌లలో పండ్ల పంపిణీ నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మండ్లీ రాములు, రవీందర్ నాయక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, ఖాదర్, గౌస్, షర్పోద్దీన్, ఖలీల్, పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా పాండు


పాండు

తలకొండపల్లి, ఏప్రిల్ 5 : బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా తలకొండపల్లి మండల కేంద్రానికిచెందిన నీలకంఠం పాండు నియమితులయ్యారు. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. ఏబీవీపీలో వివిధ స్థాయి పదవుల్లో పనిచేశారు. తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

చేవెళ్ల, ఏప్రిల్ 5 : హైదరాబాద్ నగరంలోని ఏవి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్ విద్యార్థులు శంకర్‌పల్లి మండలంలోని గోపులారం గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా విద్యార్థులు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవితానికి సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు విద్యార్థులు సూచించారు. గ్రామంలో మొక్కలు నాటి, వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

తలకొండపల్లి, ఏప్రిల్ 5 ! పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను పురస్కరించుకొని తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ ఎంపీపి సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ముస్లిం సోదరులకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేశాడు. ఇఫ్తారు విందులో ముస్లిం సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మజీదులో ప్రార్ధనల అనంతరం వారికి పండ్లు అందజేశారు. అనంతరం విందులో పాల్గొన్న వారికి శ్రీనివాస్‌యాదవ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోప్షన్ సభ్యుడు ముజుబూరు రహెమాన్, పీఎసిఎస్ వైస్‌చైర్మన్ కూన రవి, నాయకులు శ్రీరాం, రాజు, ఇమామ్ ఇంతియాజ్, రషీద్, నయ్యూం, షఫీ, సలీం, జాఫర్, సుబాన్,అహ్మద్ పాల్గొన్నారు.

జగన్ ను సత్కరించిన ఎమ్మెల్యే వంశీ

ఆమనగల్లు , ఏప్రిల్ 5: ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికైన కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లే పల్లి జగన్ ను అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అభినందించారు. అచ్చంపేట లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న జగన్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చట్టాలు, న్యాయ వ్యవస్థపై బార్‌అసోసియేషన్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని వంశీకృష్ణ సూచించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

తలకొండపల్లి, ఏప్రిల్ 5 : విద్యతోనే సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. పడకల్ గ్రామానికిచెందిన చౌటి జంగమ్మ, పాపయ్య కుమార్తె స్పందన ఉన్నత చదువుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీటీసీ రమేశ్ ఆమె చదువుకు చేయూతనందించాలని అభ్యర్థించారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎలమ్మతిరుపతయ్య, నాయకులు అంజయ్య, శ్రీశైలం, జగ్గారెడ్డి, రాములు, చెన్నయ్య, నర్సింహ్మ, మల్లేశ్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సర్వీస్ వైర్లను అపహరించిన దొంగ రిమాండ్

యాచారం, ఏప్రిల్ 5 : బోర్ మోటార్ల సర్వీస్ వైర్లను అపహరించిన ఓ దొంగను గురువారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఆకుల మైలారం గ్రామంలో 12 వ్యవసాయ బోర్ మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని దుండగులు అపహరించినట్లు బాధిత రైతులు మూడు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టగా మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన సతార్ జంగారెడ్డి(70) అనే వ్యక్తి వాటిని అపహరించినట్లు తేలింది. అతన్ని గురువారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 5 : షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఏఎస్సై రాంచంద్రయ్య తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయస్సు కలిగిన ఆ వ్యక్తి మృతదేహం హెచ్‌పీ పెట్రోల్ పంప్ పక్కన పడి ఉన్నట్లు చెప్పారు. మృతదేహంపై తెలుపు ఫుల్ షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ఉన్నట్లు ఎర్రరంగు స్లిప్పర్స్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు షాద్‌నగర్ పోలీస్‌లను సంప్రదించాలని ఆయన చెప్పారు.

అక్రమంగా బండరాళ్లను కొడుతున్న వారిపై కేసు

కేశంపేట, ఏప్రిల్ 5: అక్రమంగా బండరాళ్లను కొడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన కేశంపేట మండలం భైర్కాన్‌పల్లిలో చోటు చేసుకుంది. భైర్కాన్‌పల్లి గుట్టపై కొందరు వ్యక్తులు కంప్రెషర్‌తో బండలు పగలగొడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి కేశంపేట ఎస్సై కుప్పగిరి లింగం ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన పల్లపు వెంకటయ్య, తిమ్మాజిపేట మండలం బాజీపూర్ గ్రామానికి చెందిన జీనుకుంట్ల ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. సుమోటోగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి, వారి నుంచి కంప్రెషర్ ట్రాక్టర్, జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందుతులను శుక్రవారం రిమాండ్‌కు తరలించనట్లు ఎస్సై చెప్పారు.

లారీని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాద్‌నగర్‌లోని ఫరూక్‌నగర్ మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి జనార్ధన్‌రెడ్డి, అతని భార్య జానమ్మ 10 రోజుల క్రితం శంషాబాద్‌లోని వారి బంధువుల ఇంటికి వచ్చారు. శుక్రవారం తిరిగి వారి స్వగ్రామానికి బయలుదేరారు. జానమ్మను శంషాబాద్ బస్టాండ్‌లో బస్సు ఎక్కించిన జనార్ధన్‌రెడ్డి టీఎస్ 07 ఎఫ్‌జె 0501 నెంబరు గల స్కూటీపై వెళ్తుతుండగా మార్గ మధ్యలో మదన్‌పల్లి వద్దకు రాగానే అదే రూట్లో వెళుతున్న టీఎస్ 37 టీబీ 4988 నెంబరు గల లారీని వెనక నుంచి బలంగా ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో వాహనాదారులు పోలీసులకు సమాచారమందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని అతన్ని శంషాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

చేవెళ్ల, ఏప్రిల్ 5 : బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసానిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మాసానిగూడకు చెందిన ద్యాసరి రాములు(35) రెండు రోజుల నుంచి అనారోగ్య బాధపడుతున్నాడు. కాగా గురువారం రాత్రి పడుకున్న సమయంలో ఓ బల్లి మీద పడింది. ఈ విషయాన్ని రాములు తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. స్నానం చేసి పడుకోమని వారు అతనికి చెప్పారు. స్నానం చేసిన అనంతరం బయటికి వెళ్లొస్తానని చెప్పి అర్ధరాత్రి సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం ఓ బావిలో శవమై కనిపించాడు. అతని భార్య అనిత ఫిర్యాదు మేరకు ఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


యాదమ్మ

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పాల్మాకుల గ్రామానికి చెందిన గూడెపు యాదమ్మ మార్చి 27న శంషాబాద్‌లోని రాళ్లగూడకు బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త యాదయ్య 28న ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యాదమ్మ శంషాబాద్‌లో బస్సు ఎక్కి పెద్దషాపూర్ బస్టాప్‌లో బస్సు దిగినట్లు సీసీ ఫుటేజీల్లో కనిపించింది. దీంతో పోలీసులు ఈ కేసును తిరిగి శుక్రవారం శంషాబాద్ స్టేషన్‌కు మార్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తండ్రిని చంపిన నిందితుడి రిమాండ్


అనురాగ్

ఆదిభట్ల, ఏప్రిల్ 5 : ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుర్క యాంజాల్‌లో గురువారం కన్న తండ్రిని పెట్రోల్ పోసి చంపిన కేసులో నిందితుడు, మృతుడు రవీందర్ కుమారుడు అనురాగ్(25)ను శుక్రవారం ఆదిభట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్టు

కడ్తాల్, ఏప్రిల్ 5 : దాడి కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. పెద్ద వేములోని బావితండాకు చెందిన రమావత్ దేవ్య, గడ్డమీది తండాకు చెందిన విస్లావత్ మల్లేష్ పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని పెద్దవేములోని బావి తండాకు చెందిన రమావత్ రాజేందర్‌పై ఫిబ్రవరి 27న దాడికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్టు చేసి మహేశ్వరం కోర్టులో హాజరు పరిచి, చర్లపల్లికి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


నవీన్

కడ్తాల్, ఏప్రిల్ 5 : మండల పరిధిలోని రావిచేడు గ్రామానికి చెందిన మన్నె నవీన్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఆయన భార్య శైలజ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 1న రోజు మాదిరిగానే నవీన్ తన మిర్చి బండి నడపడానికి కేశంపేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. నవీన్ భార్య శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. ఒకరి మృతి

మాడ్గుల, ఏప్రిల్ 5 : ట్రాక్టర్‌ను వెనక నుంచి వచ్చిన ఓ కారు ఢీకోట్టంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అన్నేబోయినిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జిల్లా యాదయ్య(35) చింతపల్లి నుంచి అన్నేబోనిపల్లి వైపు వస్తుండగా అదే మార్గంలో వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టటంతో అన్నేబోనిపల్లిగేటు సమీపంలో సాగర్‌రోడ్డు వద్ద ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. కారు వెనక నుంచి వేగంగా ఢీకోట్టడంతో యాదయ్య ట్రాక్టర్ కిందబడి మృతి చెందినట్లు గ్రామస్థులు చెప్పారు. కారులో ఉన్న ముగ్గరికి సల్ప గాయాలైనట్లు తెలిపారు. మృతుడికి భార్య శారద, ఇద్దరు పిల్లలున్నారు..